క్లుప్తంగా

పీటీజీ ప్రిన్సిపాల్‌గా శామ్యూల్ జోబ్



విజయపురిసౌత్: స్థానిక పీటీజీ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్‌గా పి.శామ్యూల్ జోబ్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన అనంతపురం జిల్లా గొల్లలదొడ్డి ఏపీడబ్ల్యూఆర్ స్కూల్ నుంచి డిప్యుటేషన్‌పై పీటీజీ పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు శామ్యూల్ జోబ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.

దూర విద్య ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కారెంపూడి: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం కింద దూర విద్యలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకోవాలని అభిలషిస్తున్న వారు జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 28 లోపు సార్వత్రిక విద్యా పీఠం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ దూర విద్యా కేంద్ర సెంటర్ నిర్వాహకుడు ఆ పాఠశాల హెచ్‌ఎం జి.అనంత శివ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, పదవ తరగతిలో చేరడానికి 14 ఏళ్లు నిండాలని, ఇంటర్‌లో చేరడానికి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండడంతో పాటు 15 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

అత్యధిక వర్షపాతం నమోదు

మాచర్ల: మాచర్ల పట్టణంలో బుధవారం 44.2 మి.మీల వర్షపాతం నమోదైంది. మాచర్ల, గురజాల డివిజన్‌లోని పలు ప్రాంతాలలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీగా వర్షం కురిసిందని ఏఎస్‌వో శ్యాం బుధవారం తెలిపారు. అందులో భాగంగా మండలాలకు సంబంధించిన వివరాలు తెలుపుతూ గురజాల డివిజన్ పరిధిలో పిడుగురాళ్ళలో 16.4 మి.మీ, దుర్గిలో 26.4 మి.మీ, రెంటచింతల 2.6 మి.మీ, మాచర్లలో 44.2 మి.మీ, గురజాలలో 1.2 మి.మీ, వెల్దుర్తిలో 27.4 మి.మీ, కారంపూడిలో 16.4 మి.మీ, దాచేపల్లిలో 4 మి.మీ, మాచవరంలో 10.2 మి.మీ నమోదైనట్లు తెలిపారు. మొత్తం 16.53 మి.మీ నమోదు కావాల్సి ఉండగా అత్యధికంగా 148.8 మి.మీలు ఈ రెండు డివిజన్‌లలో నమోదైనట్లు తెలిపారు.

కోతుల బెడదను తొలగించండి



మాచర్ల: దుర్గి మండలంలోని పోలేపల్లిలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, వాటిని నివారించేందుకు మాచర్ల మున్సిపల్ అధికారుల సహాయ సహకారాలందించాలని పోలేపల్లి యువకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. వారి గ్రామంలో అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని.. త్వరితగతిన కోతుల బెడద లేకుండా చేయాలని కోరారు. మండలానికి సంబంధించి అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవటం లేదని, కోతులను పట్టించే వారు మాచర్ల మున్సిపాలిటీలో ఉంటారని ఆ సమస్యను తెలిపేందుకు మాచర్లకు వచ్చినట్లు ఆవేదనతో తెలిపారు. మున్సిపల్ అధికారులు అవకాశమున్న మేరకు త్వరలో మాచర్లకు కోతులు పట్టేవారు వస్తే పోలేపల్లిలోనూ కోతులు పట్టేలా తమ వంతు సహాయ సహకారాలందిస్తామన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

సత్తెనపల్లి: ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ..తల్లిదండ్రుల సహకారం లేని ప్రతిభావంతులైన విద్యార్థులను ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ దత్తత తీసుకొని, వారి పూర్తి ఫీజు దాతల సహకారంతో అందిస్తున్నారు. పట్టణానికి చెందిన షేక్ అయాజ్ అనే పదో తరగతి విద్యార్థి భవిష్య పాఠశాలలో విద్యనభ్య శిస్తున్నాడు. అతని తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో అయాజ్ స్కూల్ ఫీజు, ఇతర అవసరాలు మొత్తం తీరుస్తానని కొత్త రామకృష్ణ ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది 8 మంది విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థికి ఆర్థిక సాయం అందించిన వంశీ స్పెషలిటీ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ షకీలా శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్య పాఠశాల కరస్పాండెంట్ ఐ.శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ

సత్తెనపల్లి: ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించ వచ్చని ప్యానల్ న్యాయవాది ఆకుల నాగార్జున అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు సూచనల మేరకు ఫణిదం గ్రామంలో మోటారు వాహనాల చట్టంపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పారా లీగల్ వలంటీర్ షేక్ ముబారక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను మైనర్లకు ఇవ్వొద్దని కోరారు. పారా లీగల్ వలంటీర్లు షేక్ సుభాని, షేక్ ఖాజా వలి, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



కాల్వ బ్రిడ్జి అసాంతం గోతుల మయంగా కన్పిస్తున్న దృశ్యం



సాగర్ కుడి కాల్వపై వినుకొండ రోడ్డులో ఉన్న బ్రిడ్జిపై పడిన పెద్ద గోతులు



ధ్వంసమైన నాగులేరు బ్రిడ్జి సైడ్ రైలింగ్

అధ్వానంగా బ్రిడ్జిలు..

ప్రమాదంగా ప్రయాణం

- నిర్వహణను పట్టించుకోని అధికారులు
- దైన్య స్థితిలో నాగులేరు, సాగర్ కాల్వ బ్రిడ్జిలు

కారెంపూడి: కారెంపూడిలో ఉన్న రెండు ఆర్ అండ్ బీ రోడ్డు బ్రిడ్జిలు ప్రమాద భరితంగా ఉన్నాయి. ఇంకా నిర్లక్ష్యం చేస్తే జరగరాని ప్రమాదం జరిగే అవకాశం పొంచి ఉంది. వినుకొండ వెళ్లే రోడ్డులో సాగర్ కుడి కాల్వ అక్విడెట్ వద్ద రోడ్డు బ్రిడ్జి ఉంది. ఆ బ్రిడ్జిపై పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఇక వర్షం పడితే ఆ బ్రిడ్జిపై గుంతలను కనిపెట్టడం కష్టంగా మారింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు చోట్ల గోతులు పూర్తి రంధ్రాలుగా మారాయి. బ్రిడ్జి మీద నుంచి కింద పారుతున్న సాగర్ కాల్వ నీరు కన్పిస్తుంది. ఆ రంధ్రాలు కనపడకుండా మాసిక వేశారు. కానీ అలాంటి వాటి కంటే ప్రమాదకరమైన పెద్ద గుంతలు అనేకం బ్రిడ్జిపై దర్శనమిస్తున్నాయి. అక్విడెట్ కూడా నిర్వహణ లోపంతో గేట్ల అంచుల్లో విపరీతమైన వ్యర్థాలతో కన్పిస్తున్నాయి. బ్రిడ్జి సైడ్ రైలింగ్ కూడా అక్కడక్కడ పగిలిపోయి ఇనుప ఊచలు బయటకు కన్పిస్తున్నాయి. ఇది ప్రధాన రహదారి కావడంతో బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో పాటు భారీ లోడుతో గ్రానైట్ ఇతర సిమెంటు లోడు లారీలు వస్తుంటాయి. ఇదిలా ఉంటే స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నాగులేరుపై నిర్మించిన బ్రిడ్జి పరిస్థితి అలాగే ఉంది. ఇక్కడ ఫుట్ పాత్ కోసం ఏర్పాటు చేసిన సిమెంటు పలకలు పగిలిపోయాయి. దీంతో పాదచారులు పడిపోతున్నారు. సైడ్ రైలింగ్ కూడా పంచాయతీ మరుగుదొడ్ల ప్రాంతంలో పాడైపోయింది. వర్షం పడితే బ్రిడ్జిపై నీరు నిల్వ ఉంటోంది. బ్రిడ్జిపై నీరు వాగులోకి పోయే విధంగా ఉన్న కానాలు పూడిపోయాయి. వాటిని క్లీన్ చేసిన దాఖలాలు లేవు. బ్రిడ్జిపై ఉన్న మట్టిని తొలగించే ప్రయత్నం చేయడం లేదు. బ్రిడ్జి పిల్లర్స్‌పై రావి చెట్లు మొలిచి పెద్దవి అవుతున్నాయి. వీటిని పట్టించుకోకపోతే ఇవి ఇంకా త్వరగా పాడైపోతాయి. ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది.



కారెంపూడి నాగులేరు బ్రిడ్జిపై పగిలిన ఫుట్ పాత్

ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు చేయండి

హెచ్‌ఎంలకు ఆదేశాలిచ్చిన ఎంఈవోలు

కారెంపూడి: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు ఆగస్టు 8వ తేదీన నిర్వహించాలని అందుకోసం ఆగస్టు ఒకటో తేదీన నోటిఫికేషన్ ఇవ్వాలని మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలను ఎంఈవోలు కె.కాంతారావు, పి.రవికుమార్ కోరారు. మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్‌లు అందరికీ అందాయా లేదా అనే విషయమై ఎంఈవోలు పాఠశాలల వారీగా సమీక్ష నిర్వహించారు. కిట్స్ మిగిలితే వాపసు చేయాలని అవసరమైన వారు తీసుకెళ్లాలని కోరారు. అన్ని పాఠశాలలకు ఎస్‌ఎంసీల ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని అందుకు విద్యార్థుల తల్లిదండ్రులను ఓటర్లుగా గుర్తించి జాబితా తయారు చేయాలని ఆదేశించారు. గురువారం ఎస్‌ఎంసీ ఎన్నిక నోటిఫికేషన్ ఇవ్వాలని, ప్రతి క్లాస్ నుంచి ముగ్గురు తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నిక చేయాల్సి ఉందని వారంతా సమావేశమై ఎస్‌ఎంసీ చైర్మన్‌ను ఉప చైర్మన్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుందని ఎంఈవోలు వివరించారు. వీటితో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇదిలా ఉంటే ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశాలలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఆర్‌పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో–1 కాంతారావు

సమర్థ అధికారి జోషిరాజు

డీపీవో విజయభాస్కర్‌రెడ్డి

దాచేపల్లి : విధి నిర్వహణలో సమర్థవంతమైన అధికారిగా ఈవోపీఆర్డీ రావూరి జోషిరాజు పేరు సంపాదించుకున్నారని డీపీవో ఎంవీ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. దాచేపల్లి ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న జోషిరాజు ఉద్యోగ విరమణ సన్మాన సభను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఉద్యోగ విరమణ చేసిన ఈవోపీఆర్డీ దంపతులను శాలువా, పూలదండలతో సన్మానించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న డీపీవో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. జోషిరాజు నిబద్ధత, చిత్తశుద్ధితో విధులు నిర్వహించారని, కొత్తగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడన్నారు. పని ఒత్తిడి అధికంగా ఉన్నా చక్కటి చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించే మనస్తత్వం కలిగిన వ్యక్తి అని, ప్రభుత్వం ద్వారా మెరుగైన సేవలను ప్రజలకు అందించేందుకు శక్తివంచన లేకుండా పనిచేశారని గుర్తు చేశారు. ఈవోపీఆర్డీ జోషిరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగమనేది చదువుకున్న ప్రతి వ్యక్తి కల అని, ఆ కలను సాకారం చేసుకునేందుకు ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. నా పరిధిలో ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేశానని, విధి నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించలేదన్నారు. ప్రభుత్వ అధికారిగా ప్రజలకు సేవలు చేయటం నా కర్తవ్యంగా భావించి పని చేశానని, విధి నిర్వహణలో తోటి ఉద్యోగులు సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో గ్రబునాయక్, ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, పలువురు ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ఈవోపీఆర్డీ జోషిరాజు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

విద్యాభివృద్ధికి పరాశక్తి చేయూత

రెంటచింతల: పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలోని వివిధ గ్రామాలలో నున్న ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయడంతో పాటు విద్యార్థుల అభివృద్ధికి ఫ్యాక్టరీ యాజమాన్యం ఎల్లప్పుడూ చేయూత నందిస్తుందని పరాశక్తి ఇండస్ట్రీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు అన్నారు. బుధవారం మండలంలోని మల్లవరం, జెట్టిపాలెం, పశర్లపాడు, గోలి గ్రామాలలో నున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 560 మంది విద్యార్థులకు రూ.1.82 లక్షల విలువైన నోట్ పుస్తకాలు, పలకలు, పెన్‌లు, పెన్సిళ్లు, ఆట వస్తువులను ఆయన ఫ్యాక్టరీ సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.వెంకటరావు, జనరల్ మేనేజర్లతో కలసి పంపిణీ చేసి మాట్లాడారు. ఫ్యాక్టరీ ప్రారంభం నుంచి విద్యాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారం అందచేయడానికి ముందుంటున్నట్లు తెలిపారు. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్‌లు ఎం.రామకృష్ణారెడ్డి, జి.చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.మల్లిఖార్జునరావు, హెచ్‌ఎంలు ఎస్.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న పరాశక్తి ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ రాజు

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

వెల్దుర్తి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి మల్లుస్వామి అన్నారు. బుధవారం మండలంలోని గుడిపాటి చెరువులో జాంబియా దేశానికి చెందిన పీహెచ్‌డీ విద్యార్థులు కెబా, జోనల్, కెమో ఆధ్వర్యంలో 70 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మల్లుస్వామి మాట్లాడుతూ విదేశాలకు చెందిన పరిశోధనా విద్యార్థులు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. మామిడి, బత్తాయి పండ్ల మొక్కలు నాటడం జరిగిందన్నారు. మాతా అమృతానందమయి యూనివర్సిటీ ఆధ్వర్యంలో గుడిపాటి చెరువులో పరిశోధనలు చేసేందుకు వచ్చిన విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం సంతోషకరమన్నారు. ఈ మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత గృహ యజమానులదేనన్నారు. ఈ కార్యక్రమంలో మాతా అమృతానందమయి ప్రతినిధి మల్లిఖార్జున, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న జాంబియా దేశస్థులు

కార్మికుల సమస్యలపై పోరాటం చేద్దాం



మాచర్ల: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తీవ్ర కృషి చేసిన స్వర్గీయ పరంధామయ్య స్మారక సభతో పాటు వివిధ సమస్యల పరిష్కారానికి నరసరావుపేటలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు బండ్ల మహేష్ బుధవారం కోరారు. ఈ విషయాన్ని పరిశీలించి తప్పనిసరిగా మున్సిపల్ అధికారులు స్పందించాలన్నారు. గతంలో మున్సిపాలిటీలో ఉన్న ప్రతి ఒక్క అధికారికి మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ నేపథ్యంలో స్వర్గీయ పరంధామయ్యను గుర్తు చేసుకుంటూ స్మారక సభ, వివిధ సమస్యల పరిష్కారానికి నరసరావుపేటకు తరలిరావాలని కోరుతూ మున్సిపల్ కార్మికులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఇంటి వద్దే పింఛన్ పంపిణీ

ఎంపీడీవో శంకర్‌రావు



రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో పింఛన్ లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని 11 గ్రామాలలో మొత్తం 7,042 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని వారికి రూ.2,99,55,000 అందజేయడం జరుగుతుందన్నారు. మొదటి రోజు ఆగస్టు 1వ తేదీ ఉదయం 5 గంటలకు ప్రారంభించి సాయంత్రం 6 గంటల కల్లా 99 శాతం మందికి పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏమైనా సాంకేతిక సమస్యలు వస్తే రెండో రోజు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. 2వ తేదీ పంపిణీ పూర్తయిన తరువాత మిగిలిన నగదు మొత్తాన్ని ఎస్‌ఈఆర్పీకి తిరిగి చెల్లించాలని సూచించారు. పింఛన్‌దారులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే జేబీఆర్ ఆధ్వర్యంలో పింఛన్ పంపిణీ

మాచర్ల: నేడు పట్టణంలో ఉదయం 9.30 గంటలకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ ఆలయం ఎదురుగా లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేయటం జరుగుతుందని టీడీపీ నాయకులు తెలిపారు. గురువారం జరిగే పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే జేబీఆర్ పాల్గొని పంపిణీ చేస్తారన్నారు. లబ్ధిదారులంతా గురువారం సామాజిక పింఛన్ పొందాలని కోరారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

మాచర్ల: పింఛన్ పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభించటం జరుగుతుందని, ప్రతి లబ్ధిదారు పింఛన్ పొందాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్ కోరారు. బుధవారం రాత్రి ఆయన సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల్లో పింఛన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అన్నారు. ఎక్కడా రాజీ పడకూడదని ప్రతి లబ్ధిదారుకు పింఛన్ అందజేయాలని తెలిపారు.

దుర్గిలో...

దుర్గి: మండలం వ్యాప్తంగా నేడు గ్రామ సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులచే ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు అధికారులు బుధవారం తెలిపారు. ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. 6,815 మందికి రూ.2,90,75,000 అందజేస్తామన్నారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

గ్రామాలలో కొనసాగుతున్న ఇంటింటి సర్వే

రెంటచింతల: కుష్ఠు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. జూలై 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే ఇంటింటి సర్వేను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 11 గ్రామాలలో 42 బృందాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 686 ఇళ్లను, 2,524 మందిని పరీక్షించి 21 మంది కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి పీహెచ్‌సీకి పంపించడం జరిగిందన్నారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై, నొప్పి లేని బొడిపెలు ఉన్నా, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, తెలియకుండానే చేతులపై, కాళ్లపై బొబ్బలు రావడం, చేతివేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగ వైకల్యం రావడం వంటి వాటిని కుష్ఠు వ్యాధి లక్షణాలుగా గుర్తించవచ్చన్నారు. ఈ లక్షణాలు ఉన్నవారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య సేవలు పొందవచ్చన్నారు. ఆరోగ్య కార్యకర్త వద్ద నుంచి యం.డి.టి మందులు ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఏడీ శర్మ, ఎ.అంజనేయులు, సూపర్‌వైజర్స్ ఎస్.కోటేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మి ప్రసన్న, నిర్మల, హెల్త్ అసిస్టెంట్స్ మహేష్, డి.సీతారామిరెడ్డి, ఖాసిం తదితరులు ఉన్నారు.



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తెనపల్లి: జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తెనపల్లిలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ అండర్ –15 టోర్నమెంట్ గుంటూరు బృందావన్ గార్డెన్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 26న నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 10 పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి క్రీడాకారులు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయరాణి బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.అచ్చిరెడ్డి, రాజా, క్రీడాకారులు తది తరులు ఉన్నారు.



కప్ అందజేస్తున్న హెచ్‌ఎం విజయరాణి

ఎర్ర బొమ్మిడి తెగులు.. పత్తి రైతు దిగాలు

కారెంపూడి: పత్తి పంటను ఎర్ర బొమ్మిడి తెగులు ఆశించింది. దీంతో ఆకులు వడలిపోయి చెట్టంతా ఎండిపోతోంది. ఇది ఒక ప్రాంతానికే పరిమితం కాలేదు, దాదాపు మండలం అంతా కన్పిస్తోంది. ఈ తెగులు సోకితే ఇక పైరు కాపు దాదాపు పూర్తిగా ఆగిపోతుంది. ఉన్న కాయలు పగిలితే పత్తి తీసుకునే పనిలో రైతులున్నారు. వారం క్రితం వరకు 20 రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల ముందస్తుగా వేసిన పత్తి పైర్లకు తెగులు ఆశించింది. బాగా కాపు కాసిన పైర్లలో ఈ తెగులు పూర్తిగా విస్తరించింది. లేత పైర్లకు తెగులు సోకలేదు. వర్షాలు వరుసగా కాకుండా అప్పుడప్పుడు కురిసి ఉంటే పత్తి చేలు బాగుండేవని నిరంతర వర్షాల వల్ల ఇబ్బంది వచ్చిందని రైతులు తెలుపుతున్నారు. కారెంపూడి మండలంలో 2,200 ఎకరాలలో ముందస్తు పత్తి సాగులో ఉంది. ప్రస్తుతం పత్తి తీతలు ప్రారంభమయ్యాయి. ఎర్ర బొమ్మిడి వల్ల ఆకులు రాలిపోయి మొక్కలు ఎండి పోయినట్లు కావడంతో ప్రస్తుతం కాస్తున్న ఎండలకు కాయలు కూడా త్వరగా పగులుతున్నాయి. దీంతో పత్తి విరుపులు కూడా ఊపందుకున్నాయి. ఈ తెగులుకు నివారణ కూడా ఏమీ లేదని పక్వానికి వచ్చిన కాయలు పగిలిన పత్తిని వెంటనే తీయించుకుంటున్నామని రైతులు అంటున్నారు.



కారెంపూడిలో ఎర్ర బొమ్మిడి తెగులు సోకిన పత్తి పంట

ఈ తెగులు వల్ల నష్టం

ఈ తెగులు ఎప్పుడో ఎక్కడో కాపు బాగా కాసిన తర్వాత ఆ పైరుకు వచ్చేది. అప్పట్లో పెద్దగా నష్టం ఉండేది కాదు. ఆకులు చెట్టు ఎండిపోయిన తర్వాత కాయలకు ఎండ తగిలి త్వరగా పత్తి కాయలు పగిలేవి. పత్తి తీయించుకునేవాళ్లం. కానీ ఇప్పుడు పైరు కాపు దశలోకి వచ్చింది. దీంతో లేత పైర్లు కూడా తెగులు సోకి ఎండిపోతున్నాయి. నేను మొరసన రెండెకరాలు వేశాను. కాపు చివరి దశలో తెగులు వచ్చింది.

– కొర్రపాటి మురళి, రైతు, కారెంపూడి

పెట్టుబడులు వస్తే అదృష్టవంతులం

లేత పైర్లకు కూడా వచ్చింది. ఎప్పుడైనా కాపు కాసి అయిపోయిన తర్వాత ఎర్ర బొమ్మిడి వచ్చేది. అలాంటిది కాపు దశలో ఉన్న పైర్లను సోకుతోంది. పెట్టుబడులు కూడా వస్తాయో రావో అనే భయం వెంటాడుతోంది. ఎర్ర పాలం రెండెకరాలు కౌలుకు తీసుకుని వేసవిలో పత్తి వేశాను. వేసవి ఎండల్లో నీరు పెట్టుకుని పత్తిని కాపాడుకున్నాం. కానీ కాపు దశలో ఎర్ర బొమ్మిడి వచ్చింది. పంట దిగుబడులు తగ్గుతాయి. పెట్టుబడులు అయినా వస్తే అదృష్టవంతులమే.

– ఎలిశెట్టి ఆంజనేయులు, కౌలు రైతు, ఒప్పిచర్ల

తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచాలి

ముప్పాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల్లో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి పేర్కొన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని తల్లిపాల వారోత్సవాలపై వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తల్లి పాలు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాల్సి ఉందన్నారు. తల్లిపాలకు ఎటువంటి ప్రత్యామ్నాయం లేదని, ప్రతి బిడ్డకూ తల్లి పాలు అందేలా చేయటం మన సంకల్పమన్నారు. వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హెల్త్ సూపర్‌వైజర్‌లు ఎ.పీటర్ డేమియన్, ఎం.జోస్పిన్ రాణి, సీనియర్ అసిస్టెంట్ సురేష్, ఏఎన్‌ఎం.నూర్జహాన్, జైనుల్లా, కరిముల్లా, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి పి.రమాదేవి, వైద్య సిబ్బంది